

అయ్యప్ప ఆలయానికి విరాళం


మలికిపురం: గ్రామంలో శ్రీ హరిహరసుత అయ్యప్ప ఆలయ నిర్మాణానికి ఎన్ఆర్ఐ రావి రాధాకృష్ణమూర్తి (మలికిపురం) రూ.1,01,116 విరాళం సమర్పించారు.



ఆలయ అభివృద్ధికి..

అంబాజీపేట: వక్కలంకలోని ముత్యాలమ్మ, లంకాలమ్మ అమ్మవార్ల ఆలయానికి కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వంశీకృష్ణ రూ.1,00,111 విరాళం అందజేశారు.

డెల్టాలకు 11,800 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 11,800 క్యూసెక్కుల నీటిని వదిలారు. తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.05 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

భీమేశ్వరాలయ అన్నదాన ట్రస్ట్‌కు రూ.5 లక్షల విరాళం



రూ. 5 లక్షల విరాళం ఈఓ దుర్గాభవానికి అందజేస్తున్న దాతల తరఫు వ్యక్తులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ అన్నదాన ట్రస్ట్‌కి విజయవాడకు చెందిన నాగులపల్లి శ్రీనివాస్, పల్లవి దంపతులు సోమవారం రూ.5 లక్షలు విరాళంగా అందజేశారు. వారి తరఫున విరాళం అందజేసిన ధారా జయరామకృష్ణ శాస్త్రికి ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ట్రిపుల్ ఐటీకి జిల్లా నుంచి 130 మంది విద్యార్థుల ఎంపిక

రాయవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి ట్రిపుల్ ఐటీకి మొదటి దశలో 130 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థుల జాబితాను సోమవారం విడుదల చేశారు. నూజివీడు ట్రిపుల్ ఐటీకి 32, ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీకి 19, ఒంగోలు ట్రిపుల్ ఐటీకి 28, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి 51 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా నుంచి 3.22 శాతం మంది విద్యార్థులు నాలుగు ట్రిపుల్ ఐటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి ఈ నెల 30 నుంచి జూలై 5వ తేదీ వరకు ఎంపిక చేసిన క్యాంపస్‌ల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. నూజివీడు క్యాంపస్‌కు ఎంపికైన వారికి ఈ నెల 30, జూలై 1వ తేదీల్లో ఏలూరు జిల్లాలోని నూజివీడు క్యాంపస్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఇడుపులపాయ, ఆర్కే వ్యాలీకి ఎంపికైన వారికి ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో ఈ నెల 30, జూలై 1వ తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. జూలై 2, 3 తేదీల్లో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైన వారికి నూజివీడు క్యాంపస్‌లో, జూలై 4, 5 తేదీల్లో ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికైన వారికి నూజివీడు క్యాంపస్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

ఆసనాలకు ప్రపంచ బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం



ప్రపంచ బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సాధించిన అంతర్వేది వృక్షాసన భారీ మానవహారం ఆసనాలు

అమలాపురం రూరల్: కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి నేతృత్వంలో జిల్లా యంత్రాంగంతా నెల మూడో తేదీన అంతర్వేది సముద్ర తీరంలో నిర్వహించిన వృక్షాసనం, భారీ మానవ హారం ఆసనాలు ప్రపంచ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సాధించాయి. వికసిత్ భారత్‌లో భాగంగా నిర్వహించిన యోగాంధ్ర మాసోత్సవాల ద్వారా అంతర్వేదిలో నిర్వహించిన వృక్షాసన భారీ మానవహారం ప్రపంచ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించడంపై డీఆర్వో రాజకుమారి, డ్వామా పీడీ ఎస్ మధుసూదన్, జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయ భాస్కర్ డీఎల్‌డీవో రాజేశ్వరరావు, ఎస్‌డీసీ పి కృష్ణమూర్తి, జిల్లా రవాణా అధికారి డీ. శ్రీనివాసరావు, జిల్లా స్థాయి అధికారుల బృందం కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లను అభినందించారు.

అర్జీదారుల సమస్యలకు పరిష్కారాలు

అమలాపురం రూరల్: అర్జీదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తూ పరిష్కార మార్గాలు చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ గోదావరి భవన్‌లోని ర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మీకోసం కార్య క్రమంలో 242 అర్జీలను డీఆర్ఓ రాజకుమారి ఏవో కాశీ విశ్వేశ్వరరావు, సర్వే ఏడీ కె. ప్రభాకర్ డీఎండీఓ రాజేశ్వరరావు స్వీకరించారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 21 అర్జీలు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 21 అర్జీలు వచ్చాయి. ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ నిర్వహించిన ఈ పోలీస్ గ్రీవెన్స్ కు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అర్జీదారులు వచ్చి తమ సమస్యలపై ఫిర్యాదు పత్రాలు అందించారు.



అమలాపురంలో కలెక్టరేట్‌కు ర్యాలీగా తరలివస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లి సూర్య ప్రకాష్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, మాజీ మంత్రి గొల్లపల్లి, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, పి.గన్నవరం, **అమలాపురం నియోజకవర్గం కో ఆర్డినేటర్లు పినిపే శ్రీకాంత్, గన్నవరపు శ్రీనివాసరావు**

హోరెత్తిన పోరు

- కదం తొక్కిన విద్యార్థులు, **యువత**
- అమలాపురం నల్లవంతెన **నుంచి** కలెక్టరేట్ వరకు భారీ **ర్యాలీ**
- జిల్లా నలుమూలల నుంచి **వచ్చిన** వైఎస్సార్ సీపీ క్యాడర్
- మద్దతు తెలిపిన విద్యార్థి, యువజన సంఘాలు
- ప్రభుత్వ వ్యతిరేక నినాదాల**తో** మారుమోగిన కలెక్టరేట్
- మూడుచోట్ల అడ్డుకున్న **పోలీసులు**
- వారిని నెట్టుకుని మరీ **ముందుకు..**
- ప్రభుత్వ మోసంపై ధ్వజమెత్తిన నేతలు

సాక్షి, అమలాపురం/ అమలాపురం రూరల్/ ఉప్పలగుప్తం: టీడీపీ సూపర్ సిక్స్ మేనిఫెస్టోలో ప్రకటించిన నిరుద్యోగ భృతి... ఎన్నికల సందర్భంగా నిర్వహించిన ప్రచారా సభల్లో ఊదరగొట్టిన ఉద్యోగల భర్తీ, జాబ్ క్యాలెండర్ వంటి హామీలను తక్షణం నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ కదం తొక్కింది. ఏడాది కాలంగా నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం చేసిన మోసానికి నిరసనగా వైఎస్సార్ సీపీ సోమవారం నిర్వహించిన యువత పోరుతో జిల్లా కేంద్రం అమలాపురం హోరెత్తింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పార్టీ ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధుల ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో దిక్కులు పిక్కటిల్లాయి. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎ స్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా కేంద్రమైన అమలాపురం నల్ల వంతెన వద్ద ఉన్న వంటిద్దు వెంకన్నాయుడు షాపింగ్ కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనలో మోసాలను ఎండగట్టారు. ముఖ్యంగా నిరుద్యోగ భృతి, కొత్త ఉద్యోగాల కల్పన ఎప్పుడని నిలదీశారు. ఉన్న ఉద్యోగాలను తొలగించడాన్ని తప్పుబట్టారు. ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ భృతి అందించాలని నినదించారు. అనంతరం ఈ మేరకు డీఆర్వో ఎస్.రాజకుమారికి పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్య ప్రకాష్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మిండగుదిటి శిరీష్ నారాయణల ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. శాసనమండలి సభ్యుడు బొమ్మి ఇజ్రాయిల్, రాజోలు, ముమ్మిడివరం, అమలాపురం, రామచంద్రపురం, పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్లు గొల్లపల్లి సూర్యారావు, పొన్నాడ వెంకట సతీష్ కుమార్, పినిపే శ్రీకాంత్, పిల్లి సూర్యప్రకాష్, గన్నవరపు శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎమ్మెల్యే పాములు రాజేశ్వరిదేవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి పితాని బాలకృష్ణ, విద్యార్థి విభాగం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ జిల్లెల్ల రమేష్, యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ఉంగరాల సంతోష్, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి నేతల నాని, ఆయా విభాగాల జిల్లా అధ్యక్షులు మిండగుదుటి శిరీష్, షేక్ అబ్దుల్ ఖాదర్, దొమ్మేటి సత్యమోహన్, జిన్నూరు వెంకటేశ్వరరావు, జాన గణేష్, తోరం గౌతమ్ రాజా, వంగా గిరిజాకుమారి, చీకట్ల కిషోర్, జిల్లా అధికార ప్రతినిధులు పెమ్మిరెడ్డి మురళీకృష్ణ, సుధా గణపతి, కుడిపూడి భరత భూషణ్, కాశి బాలముని కుమారి, మందపాటి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో డీఆర్వో ఎస్.రాజకుమారికి వినతిపత్రం అందిస్తున్న పార్టీ నాయకులు



కలెక్టరేట్‌కు వస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులను నెట్టివేస్తున్న పోలీసులు

పోలీసుల అవాంతరాలు

అమలాపురంలో వైఎస్సార్ సీపీ చేపట్టిన విద్యార్థి.. యువత పోరుకు ప్రభుత్వం అడుగడుగునా ఆటంకాలు సృష్టించింది. పోలీసులను అడ్డుపెట్టుకుని నిరసనను భగ్నం చేయాలని చూసింది. కలెక్టరేట్‌కు శాంతియుతంగా నిర్వహిస్తున్న ర్యాలీని రోప్ వేలు, బారికేడ్లు పెట్టి నిలిపివేయాలని చూసింది. మూడుచోట్ల పోలీసు జులుం ప్రదర్శించారు. తొలుత ర్యాలీ ప్రారంభమైన చోట, మరోసారి కలెక్టరేట్‌కు సమీపంలోను, మూడవసారి కలెక్టరేట్ మెయిన్ గేటు వద్ద కార్యకర్తలకు అడ్డంకులు సృష్టించారు. కలెక్టర్ కార్యాలయం సమీపంలో బారికేడ్లు, రోప్ పార్టీలతో కార్యకర్తలను, నాయకులను నిలువరించారు. ముందుకు వస్తున్న వారిని పోలీసులు వెనక్కు నెట్టివేశారు. ఈ సమయంలో తోపులాట చోటు చేసుకుంది. పార్టీకి చెందిన మహిళలను సైతం పోలీసులు వెనక్కు నెట్టివేశారు. దీనిపై ఆగ్రహించిన పార్టీ కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సమయంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులను నెట్టుకుని కార్యకర్తలు ముందుకు వచ్చారు. కలెక్టర్ కార్యాలయం ప్రధాన గేట్లను మూసివేసిన పోలీసులు వాటి ముందు బారికేడ్‌లు పెట్టి మరోసారి రోప్ పార్టీతో అడ్డుకున్నారు. తాము శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని, కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇస్తామని చెబుతున్నా ఎందుకు ఇంతమంది పోలీసులను పెట్టి అడ్డుకుంటున్నారని నాయకులు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. దీనితో అమలాపురం డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ కొంతమందికి మాత్రమే అనుమతి ఇస్తామని చెప్పి వారిని కలెక్టరేట్‌లోకి పంపించారు.

యువతను పాతాళంలోకి తొక్కేస్తున్నారు



చంద్రబాబు యువతను, విద్యార్థులను పాతాళంలోకి తొక్కేస్తున్నారు. ఏటా 4 లక్షల ఉద్యోగాలు చొప్పున ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తానని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారు. తొలి ఏడాది 4 లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయి. రాష్ట్రంలో ప్రజలందరినీ మోసం చేసినట్టుగా యువతను, విద్యార్థులను చంద్రబాబు నాయుడు మోసం చేస్తున్నాడు.

– గొల్లపల్లి సూర్యారావు, మాజీ మంత్రి, కోఆర్డినేటర్ రాజోలు నియోజకవర్గం

యువగళం పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానం ఏమైంది?



కూటమి ప్రభుత్వం అధికారం**లోకి వచ్చిన** తరువాత **యువతకు** పెద్ద **ఎత్తున ఉద్యోగ** అవ**కాశాలు కల్పిస్తానని వాగ్దానం చేసి అధికారం**లోకి వచ్చారు. ఉద్యోగ **అవకాశాలు వచ్చే** లోపు నిరుద్యోగ యువతకు **నెలకు రూ.3వేలు చొ**ప్పున నిరుద్యోగభృతి అం**దిస్తానని యువగళం** పాదయాత్రలో ప్రస్తుత విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ఇచ్చిన వాగ్దానం ఏమైంది.

– పినిపే శ్రీకాంత్, అమలాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్

యువతే దేశానికి, రాష్ట్రానికి వెన్నెముక



యువత స్వయంకృషితో చదువుకుని ముందుకు వెళ్తే సాంకేతిక పరిజ్ఞానం పెరిగి దేశానికి, రాష్ట్రానికి వెన్నెముకగా నిలుస్తుంది. 2004 తరువాత దివంగత నేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రతీ విద్యార్థి చదువుకునేలా ఫీజు రీయింబర్స్‌మెంటును తీసుకొచ్చి విద్యా విధానాన్ని ప్రోత్సహించారు. అదే బాటలో మాజీ ముఖ్యమంత్రి జగనన్న ఆ పథకాలను రెట్టింపు చేసి విద్యార్థులను అన్ని విధాలా ఆదుకున్నారు. కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది.

– మిండగుదిటి శిరీష్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు

యువతను రోడ్డున పడేశారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యువతను, విద్యార్థులను రోడ్డుపై పడేశారు. విద్యార్థులకు ఫీజులు చెల్లించక రాష్ట్రంలో ఉన్న వేల మంది విద్యాసంస్థల యాజమాన్యాలు చేసే ఒత్తిళ్లకు ఫీజులు చెల్లించలేక లబోదిబోమంటున్నారు. కొత్త ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ఈ మోసపూరిత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 2.60లక్షల మంది వలంటీర్‌లు, 18వేల మంది ఇతర కాంట్రాక్టు ఉద్యోగులను కలిపి 4 లక్షల ఉద్యోగాలను తొలగించి యువతకు తీవ్రమైన అన్యాయం చేసింది. సంవత్సర కాలంలో బకాయిల్లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంటును ప్రభుత్వం తక్షణమే చెల్లించి విద్యార్థులను ఆదుకోవాలి.

– పిల్లి సూర్యప్రకాష్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, రామచంద్రపురం నియోజకవర్గం కోఆర్డినేటర్

విద్యార్థులు, నిరుద్యోగులను మోసం చేశారు



కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో నిరుద్యోగ యువత, విద్యార్థులను మోసం చేసింది. విద్యార్థులకు చెల్లించవలసి ఫీజు రీయింబర్స్‌మెంటు విడుదల చేయకపోవడంతో తల్లిదండ్రులు అప్పులు బారిన పడుతున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్‌లు అధికారంతో వచ్చిన వెంటనే నాలుగు లక్షలు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారు.

– బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్సీ

తల్లికి వందనం పథకం కోత పెట్టారు



ఎన్నికల్లో ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం ఇస్తామని హామీ ఇచ్చి నిబంధనల పేరుతో అందరికీ ఇవ్వకుండా కోత పెట్టారు. పేద వర్గాలతోపాటు ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు నిలిపివేసి అన్యాయం చేశారు.

– గన్నవరపు శ్రీనివాసరావు, పి.గన్నవరం నియోజకవర్గం కో ఆర్డినేటర్

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్



ఒలింపిక్ డే రన్‌ను ప్రారంభిస్తున్న అంతర్జాతీయ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, డీఎస్పీ ప్రసాద్ తదితరులు

- 4 కిలోమీటర్ల మేర సాగిన పరుగు
- ప్రారంభించిన అంతర్జాతీయ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, డీఎస్పీ ప్రసాద్
- జిల్లాలోని 22 మండల కేంద్రాల్లో నిర్వహణ



అమలాపురం పట్టణంలో సాగుతున్న ఒలింపిక్ డే రన్

అమలాపురం టౌన్: స్పోర్ట్స్ ఫర్ యూనిటీ నినాదంతో జిల్లాలో ఒలింపిక్ డే ఉత్సవాలతోపాటు రన్‌లు కూడా సోమవారం ఉదయం ఉత్సాహంగా జరిగాయి. జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంతో పాటు జిల్లాలోని 22 మండల కేంద్రాల్లో ఒలింపిక్ రన్‌లు ఏకకాలంలో సాగాయి. అమలాపురం పట్టణంలో జరిగిన ఒలింపిక్ డే వేడుకలు ఉత్సవంగా స్థానిక దుడ్డివారి అగ్రహారంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ ప్రాంగణంలో జరిగాయి. ఈ క్లబ్ భవనం నుంచే ఒలింపిక్ రన్ మొదలైంది. ఈ వేడుకల్లో అమలాపురానికి చెందిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు, డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ శరత్‌బాబు, పప్పుల శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షణలో రన్ సాగింది. ఈ సందర్భంగా అంతర్జాతీయ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్ మాట్లాడుతూ ఒలింపిక్స్ గేమ్స్ అంటే ఐక్యతకు చిహ్నమని గుర్తు చేశారు. 25 ఏళ్లుగా క్రమం తప్పకుండా అమలాపురంలో ఒలింపిక్ డే రన్‌ను నిర్వహిస్తున్న జిల్లా అసోసియేషన్‌ను అభినందించారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ ఒలింపిక్ డే రన్ స్ఫూర్తితో జిల్లాకు చెందిన క్రీడాకారులు అమలాపురం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన సాత్విక్ సాయిరాజ్‌ను ఆదర్శంగా తీసుకుని సత్తా చాటాలని ఆకాంక్షించారు.

నాలుగు కిలోమీటర్లు సాగిన ఒలింపిక్ రన్

స్థానిక ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ వద్ద ఒలింపిక్ డే ఉత్సవాలు జరిగిన తర్వాత రన్‌ను అంతర్జాతీయ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్, ఎమ్మెల్యే సూర్యనారాయణరావు, డీఎస్పీ ప్రసాద్‌లు ఒలింపిక్ టార్చ్ పట్టుకుని ప్రారంభించారు. రన్ ముమ్మిడివరం గేటు సెంటర్ మీదుగా గడియారం స్తంభం సెంటరు, ముస్లిం వీధి, గాంధీబజార్, రవణం వీధి, గారపాటి వీధి, గండువీధి మీదుగా తిరిగి దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర సాగి ఆఫీసర్స్ క్లబ్‌కు చేరుకుంది. కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు కల్వకొలను బాబు, తిక్కిరెడ్డి శ్రీనివాసరావు, వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వర ప్రసాద్, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు మునగాల మన్యం రన్‌లో పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు చెల్లించాలి

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న జగ్గిరెడ్డి

రావులపాలెం: రాష్ట్రంలో రైతులకు 48 గంటల్లో ధాన్యం కొనుగోలు డబ్బు వారి ఖాతాల్లో వేస్తామని గొప్పలు చెప్పుకున్న కూటమి ప్రభుత్వం 48 రోజులు గడిచినా చెల్లించకుండా మోసం చేసిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అన్నారు. జిల్లాలో తాము చేసిన నిరసన కార్యక్రమం ఫలితంగా ప్రభుత్వం జిల్లాలో రెండు లక్షల 66 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. దానికి గాను రూ.613 కోట్లు ఖర్చు అయిందన్నారు. దీనిలో ఇంకా రూ.248 కోట్లు రైతులకు బాకీ తీర్చాల్సి ఉందన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం జగ్గిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. తొలుత రెంటపాళ్ల జగన్ టూర్‌లో మృతిచెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త సింగయ్య మృతికి సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ ఘటనలో జగన్‌పై కూటమి ప్రభుత్వం కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. చంద్రబాబు ఏ–1గా, హోం మంత్రిపై ఏ–2గాను, డీజీపీ పై ఏ–3 గా కేసులు పెట్టాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. జగన్ ప్రజల్లోకి వెళ్లకుండా ఆపడం కోసం ఆయనకు ప్రభుత్వం రక్షణ కల్పించడం లేదన్నారు. పుష్కరాల సమయంలో 29 మందిని పొట్టన పెట్టుకున్న చంద్రబాబుపై ఎటువంటి కేసులు పెట్టాలన్నారు. రైతులకు పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలన్నారు. జగన్ హయాంలో రైతు భరోసా సాయగా రాష్ట్రవ్యాప్తంగా 52 లక్షల మందికి ఇచ్చామన్నారు. రైతుకు పెట్టుబడి సొమ్ము వెంటనే అందేలా ఎమ్మెల్యేలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యోగా దినోత్సవానికి రూ.300 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేయడం సరికాదన్నారు. గతంలో విజయవాడలో వరదలు వస్తే రూ.23 కోట్లు అగ్గిపెట్టెలకు ఖర్చు చేశారని, విపత్తును కూడా ప్రచారానికి, ఆదాయానికి అనుకూలంగా మార్చుకునే చంద్రబాబు లాంటి సీఎం రాష్ట్రానికి ఉండటం దురదృష్టం అన్నారు. లోకేష్‌ను జాకీతో లేపి రాష్ట్ర ప్రజలపై రుద్దాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారన్నారు. సీనియర్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి వయసుకు తగ్గ మాటలు మాట్లాడితే బాగుంటుందన్నారు. మంత్రి పదవి ఇస్తారని జగన్‌పై ఇష్టానుసారం మాట్లాడుతున్నారన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ప్రతి నెలా రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి పక్కన పెట్టిన ప్రభుత్వాన్ని పవన్ కళ్యాణ్ ఎందుకు ప్రశ్నించడం లేదో చెప్పాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, దేవరపల్లి సర్పంచ్ దొమ్మేటి అర్జునరావు, రావులపాలెం ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు కప్పల శ్రీధర్, వార్డు సభ్యుడు సఖినేటి వాకుల్ రాజు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడించిన అంగన్‌వాడీలు



కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు

అమలాపురం రూరల్: వేతనాలు పెంచాలని కోరుతూ కలెక్టరేట్ దగ్గర అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ల యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్‌లోకి వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కలెక్టర్ వద్ద ఆందోళన చేశారు. సుమారు గంటపాటు ఆందోళన చేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి జిల్లా ప్రధాన కార్యదర్శి కే కృష్ణవేణి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం చేస్తారని ఆశించారని కానీ వేతనాలు పెంచకపోగా పని భారాన్ని తీవ్రంగా పెంచి రకరకాల యాప్‌ల పేరుతో ప్రీస్కూల్‌ని అటకెక్కించారని అన్నారు. పదివేల రూపాయలు వేతనం దాటింది అనే పేరుతో మొత్తం ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్‌వాడీ వర్కర్లకు నిలుపుదల చేశారని ప్రభుత్వ ఉద్యోగం అని ఆన్‌లైన్‌లో చూపిస్తోందని, సంక్షేమ పథకాలు రావని సచివాలయాల దగ్గర చెప్తున్నారని అన్నారు. అంగన్‌వాడీ హెల్పర్లు, మినీ వర్కర్లు ఏం పాపం చేశారని సంక్షేమ పథకాల అమలు చేయడం లేదని అన్నారు. రూ.11,500తో ఎట్లా బతకాలని, ఎంతోమంది ఒంటరి మహిళలు ఈ జీతం మీదే ఆధారపడి బతుకుతుంటే వాళ్ళ కుటుంబం ఎట్లా బతుకుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి మాట్లాడుతూ రెండు నెలలుగా అంగన్‌వీడీలకు వేతనాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు 20వ తేదీలోపు బిల్లు పెట్టకపోవడం దారుణమని అన్నారు. సీఐటీయూ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, ఎన్ బలరాం, యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు పి.అమూల్యకే, పి రత్నకుమారి, మహేశ్వరి, సుజాత పాల్గొన్నారు.

అమ్మ ఓడి..పోయింది

- కన్న కొడుకును చూసి కన్నుమూయాలని చివరి క్షణం వరకు తల్లి ఆవేదన
- 20 ఏళ్ల క్రితం విడిచిపోయిన కొడుకు
- తల్లి చావుబతుకుల్లో ఉందంటే చూసేందుకైనా రాని కాఠిన్యం
- అధికారుల వార్నింగ్‌తో అంతిమ సంస్కారాలకు హాజరు

కాకినాడ క్రైం: చివరి రోజుల్లో.. చిట్టచివరి క్షణాల్లో.. కొడుకు కంటి చూపు, స్పర్శ కోసం పరితపించిన ఓ తల్లి వ్యథ ఇది. కాటికి చేరే కన్నబిడ్డను కళ్లారా చూసుకుంటే చాలను కున్న ఓ వృద్ధురాలి మాతృ మూర్తి యథార్థ గాథ ఇది. అంతిమ ఘడియల్లో అన్నీ తెలిసి కొడుకు కావాలనే రాలేదన్న గుండె పగిలే చేదు నిజాన్ని తాళలేక ఆ కన్నతల్లి వ్యథతోనే కన్ను మూసిన ఓ అమ్మ కథ ఇది.


జోష్యుల రాజేశ్వరి(ఫైల్)

అనగనగా ఓ తల్లి... బొమ్మని చేసి, ప్రాణం పోసిం ది. తన రక్త మాంసాలను పంచి ఇచ్చి, ప్రసవ వేళ ప్రాణాన్నే పణంగా పెట్టి ఓ కొడుకుని కన్నది. ఊపిరంతా ఊయ్యాల చేసి లాలపాడింది, జోల పుచ్చింది. మాతృత్వపు మాధుర్యంతో తనివి తీరా తరించిపోయింది. కొడుకుని పెంచి పోషించి ప్రయోజకుడ్ని చేసింది. అమ్మ త్యాగంతో కొడుకు పెద్దోడయ్యాడు. ఎంత పెద్దోడంటే చనిపోతున్నా ను చూసిపోమంటే తనకు తీరిక లేదనేంత... అప్పు డెప్పుడో 20 ఏళ్ల క్రితం వదిలిపోయావని, నాటి నుంచి కొడుకే కానరాలేదని, చిట్టచివరగా ఒక్కసారి కనిపించి వెళ్లిపో నాయనా అంటూ తల్లి అచేతన స్థితిలో వీడియో పంపి మరీ వేడుకున్నా ఆ కొడుకు మనసు కరగలేదు. చివరికి అమ్మ ఆక్రం దనే ఓడిపోయింది. పుత్రరత్నం తాను ఉన్న హైద రాబాద్ నుంచి తల్లి ఉన్న కాకినాడ తీరిక చూసుకొని చేరేసరికి ఆయువు పోసిన అమ్మ ఊపిరి అనంత వాయువుల్లో కలిసిపోయింది. తుది మలుపులో కొడుకుని కళ్లారా చూసుకోలేకపోయిన ఆ అమాయకపు తల్లి రాజేశ్వరి అయితే, కాఠిన్యం నిండిన ఆ కొడుకు పేరు జోష్యుల రాజశేఖర్. తనువు చాలించే వేళ బిడ్డను చూస్తే చాలనుకుంది. పున్నామ నరకం నుంచి తప్పించడమే ఎక్కువనుకొని చివరి వేళ బిడ్డ దగ్గర లేకపోవడం ఆ తల్లి మింగారా కొడుకు. బిడ్డ కోసం పరితపించి

అంతిమ సంస్కారాలు మీరే చెయ్యండి

రాజశేఖర్ వచ్చి తల్లి మృతదేహాన్ని చూసి మండి పడ్డాడు. ఇంత మాత్రానికే తనను ఎందుకు ఇబ్బంది పెట్టారని విసుక్కున్నాడు. అంతిమ సం స్కారాలు కూడా మీరే చేసుకుండని ఎంత కావా లన్నా ఇచ్చేస్తానని వేరాలాడాడు. శైలజ ఆమె బృ ందం వారి వేసుకొని కౌన్సెలింగ్ నిర్వహిం చారు. ఆమె చూడాలన్న ఆఖరి కోరిక ఎలాగో తీర్చలేదు, కనీసం తలకొరివి అయినా పెట్టమని అడిగారు. సఖి వన్‌స్టాప్ సెంటర్, బాధ్యత ఫౌం డేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అంతిమ సం స్కారాలకు ఏర్పాట్లు చేశారు. ఎట్టకేలకు రాజశే ఖర్ మాతృమూర్తి మృతదేహానికి తలకొరివి పెట్టాడు. అంతిమ సంస్కారాలు బలవంతంగా చేయించిన అధికారులు, పౌండేషన్ సభ్యులపై విసుక్కొని అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

ప్రాణం విడిచిన ఆ మాతృమూర్తి దీనావస్థ మానవ త్వానికే మాయని మచ్చగా నిలిచిపోయింది. కన్న పేగు మమకారాన్ని చిదిమేసిన ఆ హృదయ విదా రక సంఘటన కాకినాడలో చోటు చేసుకుంది. ఆల స్యంగా వెలుగులోకి వచ్చింది.

కొడుకు కోసమే యావత్ జీవితం

కాకినాడ దేవాలయం వీధి వినుకొండ వారి వీధికి చెందిన జోష్యుల్ల రాజేశ్వరి(70) తన ఒక్కగానొక్క కుమారుడి కోసం తన యావత్ జీవితాన్ని అర్పిం చింది. ఆమెకి 45 ఏళ్ల కుమారుడు రాజశేఖర్ ఉన్నాడు. బిడ్డను కని బిడ్డ వదిలి పోయినా బైలింగ్ కోసం కుమారుడిని చదివించింది. పదవ తరగతి అనంతరం విడిచిపోయిన తండ్రి విలువతో రాజశే ఖర్ కేరళ వెళ్లాడు. కొన్నేళ్ల తర్వాత తల్లి వద్దకు వచ్చాడు. ఉద్యోగం కోసం వెతుకుతుంటే తల్లి.. కొడుకు బాధను అర్థం చేసుకొని తెలిసిన వారి సాయంతో కాకినాడలో ఓ ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా ఉద్యోగం వేయించింది. అదే సమయం లో, అంటే సుమారు 20 ఏళ్ల క్రితం తల్లిని వదిలి కుండానే స్థానిక కళ్యాణ మండపంలో ఓ యువ తిని వివాహం చేసుకున్నాడు. ఒకసారి తన భార్యను చూపించి, నాటి నుంచి తల్లిని వదిలిపో యాడు.

కార్పొరేటర్ చొరవతో..

అనాథాశ్రమంలో రాజేశ్వరి పరిస్థితి దయనీయంగా మారింది. ఆశ్రమ నిబంధనల ప్రకారం స్వయంగా తమ సేవలు తాము చేసుకునేవారికే అక్కడ ప్రవేశం ఉంటుంది. నానాటికీ క్షీణిస్తున్న ఆరోగ్య పరిస్థితితో రాజేశ్వరి మంచానికే పరిమితం అయింది. ఆశ్రమ యాజమాన్యం రాజేశ్వరిని చేర్చిన కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్నకు విషయం చెప్పడంతో ఆమె రాజేశ్వరిని


రాజేశ్వరి మృతదేహాన్ని కాటికి తరలిస్తున్న బాధ్యత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సత్యనారాయణ బృందం


కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రాజేశ్వరి ఆరోగ్య స్థితిని పరిశీలిస్తున్న సఖి వన్‌స్టాప్ సెంటర్ బృందం

వదిలిపోయి 20 ఏళ్లు

20 ఏళ్ల క్రితం తల్లిని వదిలిపోయిన రాజశేఖర్ మళ్లీ తల్లిని ఒక్క రోజైనా చూడలేదు. రాజేశ్వరి కొడుకు వస్తాడని ఏళ్లకు ఏళ్లు ఎదురు చూస్తూ ఓ అద్దె ఇంట్లో ఉంటూ అనారోగ్యంతో టైలరింగ్ చేసుకుంటూ తనను తాను పోషించుకునేది. వచ్చిన ఆ కొద్దిపాటి సంపాదన మందులు కోసం వెచ్చించేది. ఐదేళ్ల క్రితం అంటే ఆమె వయసు 65కి చేరాక అనారోగ్యానికి వయోభారం తోడవడంతో పరిస్థితి దయనీయంగా మారింది. తన పనులు తాను చేసుకోలేని నిస్సహాయ స్థితికి చేరి రోజుల కొద్దీ ఆహారం, ఔషధాలు లేక కుప్పకూ లిపోయింది. ఆమె దయనీయ స్థితిని చూసి పొరుగు వారు చలించిపోయారు. వారంతా విష

యాన్ని అప్పటి కార్పొరేటర్ సాలగ్రామ లక్ష్మీప్ర సన్న దృష్టికి తీసుకువెళ్లారు. కార్పొరేటర్ చొరవ తీసుకొని వలసపాకలో ఉన్న రెడ్‌క్రాస్ వృద్ధాశ్ర మంలో రాజేశ్వరిని చేర్చారు. అక్కడికి వెళ్లాక కూడా,గూడులేటు లేకున్నా కొడుకు కోసం పరితపిస్తున్న మనోవేదన మాత్రం ఆమె ఆరోగ్యాన్ని మరింత క్షీణింపజేసింది. తోటి వృద్ధులతో కొడుకు ఉండీ అనాథలా బతుకుతున్నానని చెప్పుకొని కన్నీటిపర్యంతమయ్యేది. అలా అని ఎవరిని తన కొడుకుని ఒక్క మాట కూడా అన నిచ్చేది కాదు. 20 ఏళ్లుగా వదిలేశాడంటే వాడి పరిస్థితి పాపం ఎలా ఉందో అంటూ కొడుకు ఎన్నో కష్టాల్లో ఉన్నాడనే భ్రమలో ఆ మాతృమూ ర్తి బతికేది.

కాకినాడ జీజీహెచ్‌లో చేర్పి సేవలు చేశారు. నివాసాన్ని కోరుతూ కలెక్టర్ షణ్మోహన్‌కు లక్ష్మీప్ర సన్న ఈ ఏడాది మే 12వ తేదీన లేఖ రాశారు. తక్షణమే స్పందించిన ఆయన వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు, రాజేశ్వరి బాగోగులు పరిశీ లించి తగిన నివాస సదుపాయం కల్పించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశిం చారు. ఈ నేపథ్యంలో సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ రంగనాథం శైలజ రాజేశ్వరి బాగోగుల బాధ్యతలు చూసుకున్నారు. కలెక్టర్ ఆదే శాల మేరకు, పెద్దాపురంలో బాధ్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రమన ఇల్లుకే వసతి గృ హానికి రాజేశ్వరిని తరలించారు.

కొడుకా అని కలవరిస్తూ...

నాటి నుంచి రాజేశ్వరి తన కుమారుడి పేరును కల వరిస్తూనే ఉంది. వసతి గృహ వ్యవస్థాపకుడు సత్య

నారాయణ, బృందం ఆమెకి సపర్యలు చేసేది. రాజేశ్వరి చివరి కోరికను తెలుసుకున్న సత్యనారా యణ విషయాన్ని శైలజ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె రాజేశ్వరి కుమారుడు రాజశేఖర్‌ను సంప్రదించి తల్లి దీనావస్థను వివరిస్తే రావడానికి తనకు తీరిక లేదని ఫోన్లో నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. సత్యనా రాయణ, ఆయన బృందం రాజశేఖర్‌తో మాట్లా డినా ఫలితం లేకపోయింది. తాను సంగీత దర్శకత్వం చేస్తుంటానని, చాలా బిజీగా ఉంటానని తనకు మాటి మాటికీ ఫోన్లు చేసి విసిగించవద్దని విసుక్కు న్నాడు. అప్పటికే రాజేశ్వరి చావుబతుకుల్లో కొట్టు మిట్టాడుతోంది. తిండి మానేసింది, మందులు తీసుకోవడానికి శరీరం కూడా సహకరించడం లేదు. అటువంటి నిస్సత్తువలో కూడా కొడుకు కోసమే పరితపించేది. కొడుకా కొడుకా అంటూ కలవరించేది.


అంతిమ ఘడియల్లో కొడుకు పేరును కలవరిస్తున్న తల్లి రాజేశ్వరి

పోలీసుల వార్నింగ్

రాజశేఖర్ తన తల్లి స్థితిని కళ్లకు కట్టేలా వీడియోలు పంపి వివరించినా ఏ మాత్రం చలించలేదు. పైగా చెలుకున్న వారందరినీ తిట్టడం మొదలు పెట్టాడు. దీంతో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు పోలీసులను ఆశ్రయించారు. కాకినాడ టూ టౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు సూచనలతో పోలీసులు రాజ శేఖర్‌కి కాల్ చేశారు. వచ్చి తల్లికి కనిపించి వెళ్లకపోతే సీనియర్ సిటిజన్ ప్రొటెక్షన్ యాక్ట్–2019 ప్రకారం కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో మరో మార్గం లేక రాజశేఖర్ హైదరాబాద్ నుంచి బయల్దేరి ఈ నెల 10వ తేదీన ఉదయం వచ్చాడు. అయితే కొడుకు రాకకోసం పరితపించి అతడు రావడానికి కొద్ది గంటల ముందే ప్రాణాలు విడిచింది.

అత్యంత దయనీయం



రాజేశ్వరి పరిస్థితి అత్యంత దయ నీయం. కుమారుడు రాజశేఖర్ వ్యవహరించిన విధానం మానవ త్వానికి మాయని మచ్చగా మిగిలిపోయింది. టూ టౌన్ పోలీసులు, కార్పొరేటర్ సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న చొరవ, జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టితో చివరి రోజుల్లో కనీసం కూడు, గూడు అందాయి. పీడీ విజయకుమారి ఆధ్వర్యంలో వన్ స్టాప్ బృందం, బాధ్యత ఫౌండేషన్ సత్యనారాయణ బృందం రాజేశ్వరి చివరి క్షణాల వరకు కంటికి రెప్పలా కాపుకున్నాయి. పోలీసుల జోక్యం చేసుకుంటే కానీ కుమారుడు రాలేదు.

– రంగనాథం శైలజ, అడ్మినిస్ట్రేటర్, వన్ స్టాప్ సెంటర్

తల్లి తనకేం ఇవ్వలేకపోయిందనే...



తన తల్లి మెహిర్ కుదుటా సం పాదించిన బంధువులకే పెట్టి నస్తుందన్న భ్రమలో రాజశేఖర్ ఉండేవాడని నేను కార్పొరేటర్‌గా ఉన్న 36వ వార్డుకు చెందిన ప్రజల ద్వారా తెలిసింది. అంత డబ్బే ఆమె సంపా దిస్తే, అనాథలా కన్నుమూసేది కాదన్నది స్థానికుల అభిప్రాయం. కుమారుడిని చూడాలన్న ఆమె ఆఖరి కోరిక తీర్చేందుకు ఎంతో శ్రమించాం. ఎన్నోసార్లు కాల్ చేసి ఒక్కసారి వచ్చిపొమ్మని బతిమాలాం. ఆమె మరణించినా తర్వాత కార్యక్రమాలకు మేమే చూసు కుంటామని చెప్పినా వినకుండా విసిరేసారు.

– సాలగ్రామ లక్ష్మీప్రసన్న, మాజీ కార్పొరేటర్, 36వ వార్డు, కాకినాడ

క్లుప్తంగా

బాధితురాలి చేతికి చేరిన బంగారు గొలుసు


బాధిత దంపతులకు బంగారు గొలుసు అందజేసిన డీఎస్పీ తదితరులు

సామర్లకోట: విశాఖపట్నానికి చెందిన దంప తులు సామర్లకోటలో పోగొట్టుకున్న బంగారు గొలుసును పోలీసులు సోమవారం బాధితురా లికి అందజేశారు. కలిసిరెడ్డి నారాయణమ్మ, జగన్‌మోహన్‌రావు ఆదివారం విశాఖపట్నం నుంచి బంధువుల ఇంటికి వచ్చి స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఒక హోటల్‌లో అల్పాహారం చేశారు. అనంతరం ఆ దంపతులు రోడ్డుపై పర్సు జారి విరుచుకున్నారు. రైల్వే స్టేషనుకు వెళ్లిన తరువాత చూసుకొంటే పర్సు కనిపించక పోవడంతో స్థానిక అవుట్ పోస్టులో పోలీ సులకు ఫిర్యాదు చేశారు. సుమారు మూడు తులాల బరువైన రూ. మూడు లక్షల విలువ కలిగిన బంగారు గొలుసు పోవడంతో ఎస్సై ఈ కేసును చేదించాలని పోలీసులను ఆదేశిం చారు. దాంతో ట్రాఫిక్ ఎస్సై ఆదిపా గర గాడావు అవుట్ పోస్టు పోలీసు స్టేషన్‌లో ఉన్న సీసీ కెమెరాను పరిశీలించారు. ఒక బిచ్చగాడు రోడ్డుపై పడిపోయిన పర్సు తీసుకొని జేబులో పెట్టుకోవడాన్ని గుర్తించారు. వెంటనే ట్రాఫిక్ పోలీసులు బిచ్చగాని కోసం గాలింపు చేసి గుర్తించి అతని వద్ద నుంచి పర్సును సోమవారం స్వాధీనం చేసుకున్నారు. పర్సులో బంగారు గొలుసు ఉండటంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. బాధితులకు సమా చారం ఇచ్చారు. పెద్దాపురం డీఎస్పీ కార్యాలయం లో డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ ఎ.కృష్ణభ గవాన్, ట్రాఫిక్ ఎస్సై ఆదిపా గరగారావు బం గారు గొలుసు అందజేశారు.

మహిళా ప్రజా ప్రతినిధులకు శిక్షణ ప్రారంభం


శిక్షణలో పాల్గొన్న మహిళలు

కాకినాడ సిటీ: రాష్ట్రంలో స్థానిక సంస్థల మహిళా ప్రజా ప్రతినిధులలో నాయకత్వ లక్ష ణాలు పెంపొందించేలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ ఆధ్వర్యంలో జిల్లా ప్రజా పరిషత్ కాకినాడలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్య క్రమాన్ని జిల్లా ప్రజా పరిషత్ సీఈవో వివ్వరి వేణుగోపాలరావు సోమవారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూ లింగ సమానత్వమే లక్ష్యంగా అనేక విధానాలు అమలులో ఉన్నప్పటికీ, మహిళలు రాజకీయాల్లో నిర్ణయాలు తీసుకోవ డంలో తక్కువ ప్రాతినిధ్యం పొందుతున్నార న్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి వీవీఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ మహిళా సాధికారతతో స్వపరి పాలన సాధ్యం పేరిట ఈ శిక్షణ నిర్వహిస్తున్నా మన్నారు. నిధులు, విధులు, భావ వ్యక్తీకరణ నైపుణ్యం, ప్రజాస్వామ్య విధిల సులభతరం వంటి అంశాలపై ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలు రూపొందించినట్లు తెలిపారు.

సుదర్శన హోమానికి సంప్రదాయ దుస్తులు తప్పనిసరి

- పురుషులు పంచె, కండువా..
- మహిళలు చీర, జాకెట్టు లేదా పంజాబీ డ్రెస్ చున్నీతో..

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో నిత్యం నిర్వహిస్తున్న నారసింహ సుదర్శన హోమంలో పాల్గొనే భక్తులు ఇకపై సంప్ర దాయ దుస్తులను తప్పనిసరిగా ధరించాలని దేవ స్థానం అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ సోమవారం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు దేవస్థానం కార్యాలయంలో ఒక ప్రకటన విడుదల చేశారు. పురుషులు పంచె, కండువా, మహిళలు చీర, జాకెట్టు లేదా పంజాబీ డ్రెస్, చున్నీతో పాల్గొనా లన్నారు.

సంప్రదాయ దుస్తులు ధరించడంలో పరమార్థం

దైవ దర్శనం సమయంలో సంప్రదాయ దుస్తులు ధరించడంలో పరమార్థం గురించి ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానా చార్య వింజమూరి రామరంగాచార్యులు వివరిం చారు. దేవాలయానికి వెళ్లే ముందు మనం దర్శనం చేసుకొను బయలుకు వచ్చే వరకూ మన దృష్టి దేవుని మీదనే ఉండాలి. అందుకే మన పెద్దలు భక్తులు ధరించే వస్త్రాలు సంప్రదాయ బద్ధంగా ఉండాలనే ఆచారాన్ని పెట్టారని వివరించారు.


అంతర్వేదిలో సుదర్శన హోమానికి ధరించాల్సిన సంప్రదాయ దుస్తులపై రూపకల్పన చేసిన చిత్రం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తొండంగి: మండలంలోని ఎ.వ్యొయ్యేటిలో ఓ ప్రైవేటు హేచరీలో వంట గ్యాస్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందారని ఎస్సై జగ న్మోహన్‌రావు సోమవారం తెలిపారు. ఈ నెల 18న హేచరీలో సిబ్బందికి వంట చేస్తుండగా గ్యాస్ పొయ్యి నుంచి మంటలు రావడంతో సూరాడ అనంతలక్ష్మి, కుంటేటి వీరబాబు, ప్రజాపురాని గాయపడ్డారు. కాకి నాడ ఆస్పత్రికి తరలించారు. వంపాడిపేటకు చెందిన కుంటేటి వీరబాబు(23) చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యానిమేటర్

- స్త్రీ నిధి సొమ్ము స్వాహా
- డ్వాక్రా మహిళలకు రూ.9.48 లక్షలకు టోకరా
- స్పందన, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన గ్రూపు సభ్యులు

అంబాజీపేట: బ్యాంకు ఖాతాలో స్త్రీ నిధి సొమ్ము జమ చేస్తానని నమ్మబలికి రూ.9.48 లక్షలను యానిమేటర్ స్వాహా చేసినట్టు డ్వాక్రా గ్రూపు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గంగలకుర్రు చెందిన 10 డ్వాక్రా గ్రూపు సభ్యులు అంబాజీపేట ఎంపీడీఓ కార్యాల యంలో జరిగిన స్పందన, పోలీస్ స్టేషన్‌లో సోమవా రం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధిత డ్వాక్రా సంఘాల సభ్యులు మాట్లాడుతూ స్త్రీ నిధి నుంచి 2022లో గ్రూపుకు రూ.2 లక్షలు చొప్పున 16 డ్వాక్రా గ్రూపులు తీసుకున్నాయన్నారు. కొంతమంది బ్యాంకు నకు నేరుగా వెళ్లి తీసుకున్న రుణాన్ని పూర్తిగా చెల్లించా మన్నారు. మరి కొంతమంది స్థానిక యానిమేటర్‌గా విధులు నిర్వహించిన గోరి మహాలక్ష్మికి స్త్రీనిధి సొమ్ము బ్యాంకులో జమ చేయాలని ఇచ్చామన్నారు. స్త్రీ నిధి నుంచి తీసుకున్న రుణాన్ని పూర్తిగా చెల్లించినా బ్యాం కు అధికారులు అప్పును చెల్లించాలంటూ నోటీసులు ఇచ్చారని చెప్పారు. దాంతో బ్యాంకు వారిని, స్థానిక డ్వాక్రా కార్యాలయ అధికారులను సంప్రదించగా తీసుకున్న స్త్రీ నిధి రుణానికి సంబంధించి డబ్బు చెల్లిం చలేదని చెప్పారన్నారు. తమ వద్ద నుంచి డబ్బు పట్టు కువెళ్లి, మోసం చేసిన యానిమేటర్ గోరి మహాలక్ష్మిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని అధికారులను కోరారు. దీనిపై స్త్రీ నిధి ఏరియా మేనేజర్ సురేంద్ర మాట్లాడుతూ గంగలకుర్రులో 16 డ్వాక్రా గ్రూపు సభ్యుల నుంచి రూ.9.48లక్షలను యానిమేటర్ గోరి మహాలక్ష్మి స్వాహా చేసినట్టు గుర్తించామన్నారు. వడ్డీతో కలిపి రూ.12.30 లక్షల రికవరీ చేయాల్సి ఉం దన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామన్నారు. ఇన్‌చార్జి ఎం పీడీఓ జి.బీమారావు మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపు సభ్యుల సొమ్ము కాజేసిన యానిమేటర్‌పై పోలీస్ స్టేష న్‌లో ఫిర్యాదు చేసి బాధితులకు న్యాయం చేయాలని ద్వాక్రా ఏపీఎం శ్రీనుకు సూచించారు. డ్వాక్రా మహిళల వెంట సర్పంచ్ కొండేరుల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు నెల్లి ఏడుకొండలు, అధికారులు బాల్లి ఉన్నారు.



అంబాజీపేటలో ఎంపీడీఓను కలిసిన డ్వాక్రా గ్రూపు సభ్యులు

ఎంటీఎస్ టీచర్ల బదిలీలు పూర్తి

రాయవరం/ బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పూర్వపు తూర్పుగోదావరి జిల్లా పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న 2008, 1998 డీఎస్సీ మినిమమ్ టైమ్ స్కేల్(ఎంటీఎస్) ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తి చేశారు. ఆదివారం రాత్రి 8.30 గంటలకు ప్రారంభమైన ప్రారంభమైన కౌన్సెలింగ్ సోమవారం వేకువజాము వరకు కొనసాగింది. కాకి నాడ సర్వశిక్షాభియాన్ సమావేశపు హాలులో ఆఫ్ లైన్ విధానంలో డీఈవో పి.రమేష్ ఆధ్వర్యంలో బదిలీల ప్రక్రియ చేపట్టారు. 2008 డీఎస్సీకి చెందిన 197 మంది, 1997 డీఎస్సీకి చెందిన 209 మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులు బదిలీ కౌన్సిలింగ్ ద్వారా వారికి కావాల్సిన పాఠశాలలను ఎంపిక చేసుకు న్నారు. బదిలీల్లో కోరుకున్న స్థానాలు పొందిన ఉపా ధ్యాయులు సోమవారం పూర్వపు స్థానాల్లో రిలీవ్ అయ్యి, కొత్తగా కోరుకున్న స్థానాల్లో విధుల్లో చేరారు.

శాన్‌ఫ్రాన్సిస్కోలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం ప్రదర్శన

భువనేశ్వర్: సెంచూరియన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ–మేనేజ్‌మెంట్ (సీయూటీఎం) అరుదైన ఘనత సాధించింది. శాన్‌ఫ్రాన్సిస్కోలో ప్రారంభమైన 62వ డిజైన్ ఆటోమేషన్ కాన్ఫరెన్స్ (డీఏసీ)లో పాల్గొనే అరుదైన అవకాశాన్ని చేజిక్కించుకోవడమే కాకుండా తన సామర్థ్యాన్ని ప్రదర్శించి ప్రశంసలు అం దుకుంది. ఈ కాన్ఫరెన్స్ ఈ నెల 22న ప్రారంభమై ది, 25 వరకు కొనసాగనుంది. సెమీకండక్టర్, డిజైన్ ఆటోమేషన్ పరిశ్రమ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో సెంచూరియన్ ప్రాతినిధ్యం వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్‌స్క్ టు సిస్టమ్స్ అనే శీర్షికతో నిర్వహిస్తున్న డీఏసీ కార్యక్రమానికి ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ (ఈడీఏ), సెమీకండక్టర్ టెక్నాలజీలు, సిస్టమ్ ఇన్నోవేషన్ రంగంలో దిగ్గజాలు హాజర య్యారు. వర్సిటీ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్ రావు ఆధ్వర్యంలో ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్‌దాస్, లక్ష్మీకాంత్ సుతార్‌లతో కూడిన బృందం సెంచూరి యన్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డీఎన్ రావు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి వేదికపై సామర్థ్యాన్ని ప్రదర్శించడం తొలి వర్సిటీగా సెంచూరియన్ నిలుస్తుందన్నారు. వర్సిటీలో సెమీకం డక్టర్ టెక్నాలజీ పాఠ్యాంశాలు మెరుగుపరచడానికి మార్గాన్ని సెమీ కండక్టర్స్‌తో ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. రానున్న కాలంలో ప్రపంచ స్థాయిలో సెంచూరియన్ తన ఉనికి చాటుకుంటుందని ఆశా భావం వ్యక్తం చేశారు.


శాన్ ఫ్రాన్సిస్కో డీఏసీకి ప్రాతినిధ్యం వహించిన సీయూటీఎం ప్రతినిధులు

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కరప: పెనుగుదురు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కరప మండలం పెనుగుదురు వంతెన వైపు నుంచి కాకినాడ వైపు గుర్తుతెలియని వ్యక్తి సైకిల్‌పై వెళుతుండగా పెనుగుదురు బస్‌స్టాప్ వద్ద టిప్పర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి ముఖం గుర్తుపట్టలేని విధంగా తలకు తీవ్రగాయా లయ్యాయి.

కరప ఎస్ఐ టి.సునీత సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకుని, ప్రమాద వివరాలను అక్కడివారిని అడిగి తెలుసుకున్నారు. మృతదే హాన్ని పోస్టుమార్టం కోసం కాకినాడ ప్రభుత్వా సుపత్రికి తరలించారు. మృతదేహం ప్రభుత్వాసుప త్రిలోని మార్చురీలో ఉందని, ఆచూకీ తెలి సినవారు కరప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అం దించాలని, లేదా తన మొబైల్ నంబరు 9440796557 కు ఫోన్‌చేయాలని ఎస్ఐ కోరారు. ఎస్ఐ సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి ఇంటికి వచ్చి కుప్పకూలి పీఈటీ మృతి

కాకినాడ రూరల్: పిఠాపురం సోషల్ వెల్ఫేర్ స్కూ ల్లో పీఈటీగా పనిచేస్తున్న ఎండ్రెడ్డి సూర్య ఉమా వాణిశ్రీ(53) కాకినాడ సిద్ధార్థనగర్‌లోని తల్లి ఇం టికి సోమవారం వచ్చి కుప్ప కూలి మృతి చెం దారు. సర్పవరం పోలీసుల వివరాల ప్రకారం కొద్దిసేపు మాట్లాడి సడన్‌గా పడిపోవడంతో ఆమెను కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. వైద్యులు ఆమె మృతి చెందినట్టు నిర్ధారించడంతో కుమార్తె ప్రవళిక ఫిర్యాదు మేరకు ఎస్సై నాగేశ్వర రావు కేసు నమోదు చేశారు. గుండెపోటు కారణం గా మృతి చెంది ఉంటారని భావిస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (వర్సి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

పిఠాపురం ఉద్యోగాల్లో

పిఠాపురం: ఎంతైనా ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నియోజకవర్గం కదా దానికి ఒక ప్రత్యేకత ఉండాలనుకున్నారో ఏమో దిరుద్యోగులను గాల్లో తిప్పుతున్నారు ఉన్నతోద్యోగులు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ ఉద్యోగులు గాల్లో చక్కర్లు కొడుతున్నారు. ఇతర ప్రాంతాల నుం చి బదిలీపై వచ్చిన వారిని ఇక్కడి అధికారులు జాయిన్ చేసుకోకపోవ డంతో 13 రోజులుగా గాల్లో ఉండిపోవాల్సి వచ్చిందంటూ ఉద్యోగులు వాపోతున్నారు. ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లే వారిని రిలీవ్ చేయకపోవ డంతో బదిలీలు అయిన వారు ఇక్కడే ఉండాల్సిన పరిస్థితి. ఇప్పటికే తాము పనిచేస్తున్న చోట రిలీవ్ అయిన ఉద్యోగులను ప్రస్తుతం ఇక్కడ జాయిన్ చేసుకోకపోవడంతో గాలిలో ఉన్నామంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ ఆర్జీ నుంచి బదిలీ ఉత్తర్వులతో పిఠాపురం, గొల్లప్రోలు మున్సిపాలిటీలకు ఏడుగురు జూనియర్ అసిస్టెంట్లు తుని, సామర్లకోట మున్సిపాలిటీల నుంచి బదిలీపై వచ్చిన సిబ్బంది ఉత్తర్వు లతో మున్సిపల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు తప్ప జాయినింగ్ మాత్రం అధికారులు అనుమతి ఇవ్వడం లేదు. దీంతో రెండింటికీ చెడ్డ రేవడిగా తయారయ్యింది దిరుద్యోగుల పరిస్థితి.

300 లీటర్ల స్పిరిట్, మద్యం బాటిల్స్ స్వాధీనం

అల్లవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొమరగిరిపట్నం పం చాయతీ పరిధిలోని ఆకులవారి వీధిలో యానాం, కామనగరువుకు చెందిన ఇద్దరు యువకులు నకిలీ మద్యం తయారు చేసి బెల్ట్ షాపులకు విక్రయి స్తున్న ఓ ఇంటిపై ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రేఖాఖ ఆధ్వర్యంలో సోమవారం మెరుపుదాడి చేశారు. ఈ దాడిలో నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 15 టిన్నుల్లో సుమారు 300 లీటర్ల స్పిరిట్, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ వరప్రసాదు తెలిపారు. పాండిచ్చేరి యానాం నుం చి వచ్చిన సమాచారం మేరకు మెరుపు దాడి చేశామన్నారు. నకిలీ మద్యం తయారీపై సమగ్ర విచారణ కొనసాగుతోందని వివరాలు వెల్లడిస్తామని ఎక్సైజ్ ఎస్సీ తెలి పారు. ఈ దాడిలో అసిస్టెంట్ కమిషనర్ రేణుక, ఎస్సై వర ప్రసాదుతో పాటుగా సీఐ వీవీ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.